క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు


అంగరలో గర్భిణికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సహాయకులకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 19 మంది గర్భిణులను పరీక్షించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఇద్దరిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన వైద్య పరీక్షలకు నివేదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ వేసవి ప్రభావం నేపథ్యంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోషక విలువలున్న ఆహారంపై ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి అవగాహన కల్పించారు. శిబిరంలో వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


విశేష అలంకరణలో నరసింహస్వామి

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో వేంచేసిన నరసింహస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పెద్ద కోరుమిల్లి, చిన్నకోరుమిల్లి గ్రామాలకు చెందిన భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించారు. పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు.

సేవా కార్యక్రమాల నిర్వహణకు కమిటీల ఏర్పాటు

కపిలేశ్వరపురం (మండపేట): సేవే లక్ష్యంగా ఆర్యవైశ్య సేవా సంఘం కృషి చేస్తోందని సంఘం మండపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు సంకా శ్రీనివాసరంగా శుక్రవారం తెలిపారు. మండపేట పట్టణంలో సేవా కార్యక్రమాల నిర్వహణకు సంఘానికి అనుబంధంగా మరో రెండు కొత్త కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడిగా కాళ్లకూరి గొల్లబాబు, కార్యదర్శిగా కూసుమంచి రమేష్, కోశాధికారిగా బొడ్డు ప్రసాద్, 14 మంది డైరెక్టర్లతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. మండపేట ఆర్యవైశ్య విద్యానిధి పథకం నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా కాళ్లకూరి గొల్లబాబు, ఉపాధ్యక్షుడిగా సంకా పవన్‌కుమార్, కార్యదర్శిగా కంచర్ల జలమురళీ, సహాయకార్యదర్శిగా కొనగళ్ల రవిచంద్ర, కోశాధికారిగా యిమ్మిడిశెట్టి నాగభూషణం, 12 మంది డైరెక్టర్లతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఇటీవల 34 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశామని శ్రీనివాసరంగా తెలిపారు.

అందుబాటులో ఆధార్ కేంద్రం

రామచంద్రపురం రూరల్: మండలంలో 50కి పైగా గ్రామాలకు కూడలిగా ఉన్న ద్రాక్షారామలోని పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం అందుబాటులో ఉన్నట్లు ద్రాక్షారామ పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ సత్తి వీరవెంకట సత్యనారాయణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఏప్రిల్ 15న ప్రారంభించిన ఆధార్ కేంద్రం ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఫోన్ నంబరు లింక్, వేలిముద్రలు, ఫొటో నవీకరణ, ఐరిష్ నవీకరణ, జిల్లా, పుట్టిన తేదీ, పేరు, చిరునామాలో మార్పుల సేవలు నిర్ణీత రుసుముతో చేస్తారని వివరించారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అందిస్తున్న రేషన్ నిలిచిపోతుందని చాలా మంది రేషన్ కార్డుదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీంతో పాటు శిశు ఆధార్, మార్పులు, చేర్పుల కోసం ప్రయోజనం కల్పించేలా ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు నేడు భూమిపూజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శనివారం ఉదయం పది గంటలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భూమిపూజ నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ మేనేజర్ సీహెచ్ గోవిందరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

అర్జీల పరిష్కారానికి కృషి


మండపేటలో అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తనకు అందిన అర్జీలను సకాలంలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వీకరించిన అర్జీల్లోని సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పరకే బంగారమాయెనే..!

- సాగులో యంత్రాల వినియోగంతో ఎండు గడ్డి కొరత
- పశువుల నోరుకొడుతున్న వరి కోత మెషీన్లు
- రూ.ఏడు వేల వరకు పలుకుతున్న ఎకరం గ్రాసం
- బెంబేలెత్తుతున్న పశు పోషకులు


గొల్లపాలెంలోని పొలంలో వరికోత యంత్రంతో కోయడం వల్ల చెల్లాచెదురుగా పడి ఉన్న ఎండు గడ్డి


కాజులూరులో రైతులు మేటుగా వేసుకున్న వరి గడ్డి

కాజులూరు: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగానికీ విస్తరిస్తోంది. ఒకప్పుడు సాగు చేయాలంటే అన్ని దశల్లోనూ రైతులకు పశువుల సహకారం తప్పనిసరి అయ్యేది. ప్రస్తుతం నాట్లు వేసే దశ నుంచి నూర్పుళ్ల వరకూ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయ రంగంలో పశువులకు ప్రాధాన్యం తగ్గడమే కాకుండా, వాటికి తిండి కూడా కరవయ్యే పరిస్థితి ఏర్పడింది. రైతులు వరి కోతలకు మెషీన్లను వినియోగించడంతో గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో ప్రస్తుతం ఎకరం గడ్డి రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలుకుతోంది. దాణా ధరలకు తోడు, ఎండు గడ్డి ధర పెరగడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని పశు పోషకులు బెంబేలెత్తుతున్నారు.

వరి పంట మాసూళ్ల అనంతరం గింజలు వేరు చేయగా వచ్చే గడ్డిని రైతులు ఎండుగడ్డిగా పిలుస్తారు. ఈ ఎండుగడ్డినే స్థానికంగా రైతులు నిల్వ చేసి, ఏడాది పొడవునా పశుగ్రాసంగా వినియోగిస్తుంటారు. గతంలో రైతులు కూలీలతో పంట కోయించి, పనలు ఒడ్డుకి చేర్చి, నూర్పుళ్లు చేయించేవారు. నూర్పుళ్లు చేసిన పడుగులు దులిపి గింజలు వేరు చేయగా ఎకరానికి సుమారు 1.5 టన్నుల ఎండు గడ్డి వచ్చేది. ప్రస్తుతం డెల్టాలో కూలీల కొరత ఏర్పడటానికి తోడు, నూర్పిడి యంత్రంతో తక్కువ ఖర్చుతోనే మాసూళ్ల పూర్తవుతుండటంతో రైతులు ఆ దిశగానే పనులు చేపడుతున్నారు. ఈ విధానంలో వరికోత యంత్రం పొలంలో వరి మొక్క సుతల భాగాన్ని తుంచి, గింజలను వేరు చేసి, నుజ్జయిన గడ్డిని పొలంలోనే చెల్లాచెదురుగా పారేస్తుంది. ఈ గడ్డి మేటు వేయడానికి, పశువులు తినటానికి పనికి రాదు. మొక్క నుంచి గింజలు వేరు చేసి, గడ్డి నలగకుండా, కట్టలుగా కట్టే వరికోత మెషీన్లు కొన్ని ఏరియాల్లో వాడుకలో ఉన్నప్పటికీ, అవి అత్యంత ఖరీదుతో కూడుకున్నవి కావటంతో ఈ ప్రాంతంలో వినియోగించటం లేదు. దీంతో డెల్టాలోనూ ఎడ్డుగడ్డి కొరత ఏర్పడింది.

నియోజకవర్గంలో ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని వివిధ గ్రామాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఎకరాకు సుమారు 1.5 టన్నుల చొప్పున 78 వేల టన్నుల ఎండుగడ్డి ఉత్పత్తి కావాల్సి ఉంది. కాజులూరు, కె గంగవరం, రామచంద్రపురం మండలాల్లో సుమారు 25 వేల వరకు పాడి పశువులు ఉండగా, ఒక్కో పాడి పశువుకు రోజుకు ఐదు కేజీల చొప్పున ఏడాదికి 45,600 టన్నుల ఎండు గడ్డి అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌లో సుమారు సగం గడ్డి కూడా దొరికే పరిస్థితి లేకపోవడం పశు పోషకులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో గడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది.

కొరత వేధిస్తోంది



వరి పొలాలను కోత మెషీన్లతో కోస్తుండటంతో ఎండుగడ్డి రావటం లేదు. దీంతో ఎండు గడ్డి కొరత ఏర్పడింది. ఉన్న ఎడ్డు గడ్డి నిల్వలు దాళ్వా పంట వచ్చే వరకూ సరిపడేట్టు లేదు. ఎండు గడ్డికి పత్యామ్నాయంగా మార్కెట్లో దాణా కొనుగోలు చేసి పెడదామన్నా పూర్తిగా చిన్న రైతులకు అది సాధ్యం కావటం లేదు.

– కర్రి రామారెడ్డి, పాడి రైతు, గొల్లపాలెం

దాణా ధరకే సరిపోదు



గడ్డికి ప్రత్యామ్నయంగా మార్కెట్‌లో దొరికే దాణాను కొనుగోలు చేసి పసువులకు పెడదామన్నా, వాటి ధర ఆకాశాన్నంటుతుండటంతో వచ్చే పాల దిగుబడి దాణా ధరకే సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పశుపోషణ సాగించటం కష్టతరంగా మారింది.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

అధిక ధరకు కొనుగోలు

గతంలో ఎకరం పొలంలోని వరిగడ్డి రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు పలికితే, ఇప్పుడు గడ్డి నాణ్యతను బట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఉందని వ్యాపారులు, పాడి రైతులు అంటున్నారు. ఈ గడ్డిని దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుండటంతో, రవాణాతో కలిపి రూ.8 వేల వరకు ఖర్చవుతుందని అంటున్నారు. కొందరు రైతులు ఉన్న గడ్డి నిల్వలను తొలకరి గడ్డి వచ్చే వరకు పరస్పరం ఒకరికొకరు సర్దుబాటు చేసుకుంటుండగా, కొందరు రైతులు అధిక ధరను వెచించి దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే దాణా, కూలీ రేట్లు పెరిగి, పాల ధర గిట్టుబాటుగా లేకపోవడంతో అంతంతమాత్రంగా ఉన్న పాడి పరిశ్రమ.. గడ్డి కొరతతో మరింత కష్టాల్లో కూరుకుపోతోందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధ సన్నద్ధతపై మాక్ డ్రిల్


మండపేట ప్రభుత్వాసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన



హసన్‌బాదలో నిర్వహిస్తున్న ర్యాలీ

కపిలేశ్వరపురం (మండపేట): ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం యుద్ధ సన్నద్ధతపై మాక్ డ్రిల్ నిర్వహించారు. స్థానిక అగ్నిమాపకాధికారి జె.హనుమంతరావు ఆధ్వర్యంలోని సిబ్బంది పలు అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. పరిసరాల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరించారు. పరిస్థితుల ప్రభావానికి ఆకస్మికంగా అనారోగ్యానికి గురైనప్పుడు ఆసుపత్రికి తరలించే విధానంపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వి.సుబ్రహ్మణ్యం, కె.వెంకట్రావు, ఎస్‌వీబీరెడ్డి, ఎ.వరప్రసాద్‌ం ఎల్‌వీజీ నాయకులు, పీవై సుధాకర్ పాల్గొన్నారు.

భారత సైన్యానికి సంఘీభావం

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద గ్రామంలో శుక్రవారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. భారత్‌కు మద్దతుగా, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్‌రావు మాట్లాడుతూ, ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదులను తుదముట్టించిన భారత దళాల క్షేమం కోసం ప్రార్థించాలని కోరారు. మహిళా ఆర్మీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ నరహరిశెట్టి సత్తిబాబు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ఉపాధి కూలీలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజబాబు


ఒంటితాడిలో కూలీలతో మాట్లాడుతున్న రాజబాబు తదితరులు

కాజులూరు: రైతులు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని శీల, కాజులూరు, శీలలంక, ఒంటితాడి తదితర గ్రామాలలో ఆయనతో పాటు, ఇతర నాయకులు పర్యటించి, రైతులు, ఉపాధి హామీ పథకం కూలీలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ, శ్రమజీవులను అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తూ, కార్మికులపై పనిభారం మోపుతోందన్నారు. ప్రశ్నించిన కార్మికులపై కేసులు పెట్టడం కోసం లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులను హింసించే కొత్త జీఓలను తీసుకొస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బుడితి ప్రభాకరరావు, ఇసుకపట్ల సుబ్రహ్మణ్యం, నందిక ఇమ్మానుయేలు, పువ్వల భైరవస్వామి, జల్లి విజయలక్ష్మి, నందిక అర్జున్, ముడికి చిన్నా, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

కపిలేశ్వరపురం (మండపేట): సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి కె.ప్రసాద్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. నివాస ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధన కోసం ప్రయోగాత్మక ప్రణాళిక రూపకల్పనపై ప్రత్యేకాధికారి కె.ప్రసాద్ చర్చించారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రణాళిక సహాయకుడు మురళీకృష్ణ, ఎంపీడీఓలు కె.సత్యనారాయణ మూర్తి, కె.రత్నకుమారి, ఎస్.కీర్తి స్పందన, డిప్యూటీ ఎంపీడీఓలు దాసరి శ్రీనివాస్, ఆర్ఎస్‌వీవీ ఈశ్వరరావు, ఎం.శ్రీనివాస్, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన ర్యాలీ


పసలపూడిలో కిశోరి వికాసంపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


జగన్నాయకులపాలెంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంతి

రాయవరం: మండలంలోని పసలపూడిలో కిశోరి వికాసంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నివారణ, ఆరోగ్య ప్రభావాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాల అసోసియేషన్ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కిశోరి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సచివాలయ జీఎంఎస్‌కే సౌజన్య, ప్రియాంక మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

రామచంద్రపురం రూరల్: బాలికలకు బాల్యంలో వివాహాలు చేయడం వల్లు ఎన్నో అనర్థాలు కలుగుతాయని రామచంద్రపురం డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి తెలిపారు. మండలంలోని జగన్నాయకులపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వీవీ వరాహలక్ష్మి మాట్లాడుతూ, కిశోరి వికాసం కార్యక్రమం మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, కిశోరి వికాసం కార్యక్రమం ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తారన్నారు. 12 కిశోరి వికాస లక్ష్యాలుంటాయని, వీటిలో ఒక్కో వారం ఒక్కొక్క దానిపై చర్చిస్తారన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సూర్యావతి, ఏఎన్‌ఎం శ్రీకాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం రాశులు


అయినవిల్లిలో తడిసిన ధాన్యానికి బరకాలు, కొబ్బరాకులు కప్పుతున్న రైతులు

అకాల వర్షాలకు రైతుల గగ్గోలు

అయినవిల్లి: అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యంరాశులు శుక్రవారం తడిసి ముద్దయ్యాయి. అయినవిల్లి, సిరిపల్లి, నేదునూరు, విలస, కె.జగన్నాథపురం, శానపల్లిలంక, ఎస్.మూలపాలెం, మాగాం తదితర గ్రామాల్లోని ధాన్యపురాశులు తడిసిపోయాయి. మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలతో కోతలు కోసిన ధాన్యాన్ని రహదారులపైనా, కళ్లాల్లో రైతులు ఆరబెడుతున్నారు. అకాల వర్షం కారణంగా అరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు వాటిన రాశులుగా పోసి రక్షించుకున్నారు. తడిసిన ధాన్యం మొలకవచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలోనే మూడు సార్లు వచ్చిన అకాల వర్షాలు తమ పంటలను పాడు చేశాయని రైతులు చెబుతున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం కాదు కదా.. దళారులు అయినకాడికి అడుగుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వాతావరణం

- ఉదయం ఉక్కబోత.. సాయంత్రం కుండపోత
- అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

రాయవరం: పంట పండే వరకూ వాతావరణం అనుకూలించింది. పంట బాగా పండింది..దిగుబడులు వస్తున్నాయి అనుకుంటున్న తరుణంలో అకాల వర్షాలు రైతులను ఉరుకులు..పరుగులు పెట్టిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ప్రతిరోజూ ఉదయం ఎండ వస్తుండడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా కమ్ముకుంటున్న కారు మబ్బులు..ఈదురుగాలులు, భారీ వర్షాలను రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టుకుంటున్న రైతులను వాతావరణం ఇబ్బందులకు గురి చేస్తోంది. రహదారులు, లే అవుట్లు, కళ్లాల్లో ఆరబెట్టుకుంటున్న ధాన్యం వర్షాలకు తడిసి పోయి రైతులు అవస్థలు పడుతున్నారు. గంట గంటకూ వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు కలత చెందుతున్నారు.

80 శాతం కోతలు పూర్తి

మండలంలో ఇప్పటి వరకు 80 శాతం కోతలు పూర్తయ్యాయి. ఇంకా 20 శాతం కోతలు పూర్తి కావాల్సి ఉంది. సాధారణంగా మే మొదటి వారానికి పూర్తి స్థాయిలో వరికోతలు పూర్తయ్యేవి. అకాల వర్షాలతో వరికోతలు ముందుకు సాగడం లేదు. భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో చేలల్లో నీరు నిలిచిపోయింది. పుంతరోడ్లు బురదగా మారడంతో ధాన్యం రవాణా కష్టమవుతోంది. కోత యంత్రాలు, ట్రాక్టర్లు మట్టిలో దిగబడి పోతున్నాయి. చేలల్లో యంత్రాలు దిగే పరిస్థితి లేని చోట కూలీలతో కోతలు, నూర్పిడి పనులు చేయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

అదనపు భారం

అకాల వర్షంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ఒక పక్క తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కూలీలను వినియోగించాల్సి వస్తోంది. ప్రతిరోజూ ఆరబెట్టడం..తిరిగి వర్షం వస్తుంటే రాశులుగా చేయడం రైతుకు తలకు మించిన భారమవుతోంది. దీని వలన ఎకరాకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


రాయవరం మండలం లొల్ల వద్ద రహదారి వెంబడి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు


రాయవరం మండలం సీతమ్మతోట వద్ద వర్షానికి తడిసిన ధాన్యం

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

ముమ్మిడివరం: మండల పరిధిలోని అనాతవరం వై.జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. చేపల లోడుతో వెళుతున్న లారీ, ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఢీకొన్న లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.